సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



కమీషన్ల కక్కుర్తి..!

కొత్తగూడెం సూపర్‌బజార్ నుంచి ఎదురుగడ్డ మీదుగా వెళ్లే రోడ్డులో చేపట్టనున్న పనులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 8లో



భారీగా గంజాయి సీజ్

పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి, భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 22°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితరపూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, మంత్రపుష్పం, నివేదన, హారతి తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కార్తీకమాసం సందర్భంగా ఆకాశదీపోత్సవం, దీపారాధన చేశారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, అర్చకులు, వేదపడింతులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

ఆదివాసీలకు సంక్షేమ ఫలాలు అందాలి



మాట్లాడుతున్న ట్రైకార్ జీఎం శంకర్‌రావు

భద్రాచలంఅర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ధర్తీ ఆబా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ యోజన పథకాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని, తద్వారా ఆదివాసీ గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందించాలని ట్రైకార్ జీఎం శంకర్ రావు అధికారులకు సూచించారు. ఐటీడీఏలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని అర్హులకు అందేలా చూడాలని అన్నారు. ప్రతీ పంచాయతీలలో ప్రత్యేకంగా గ్రామసభలు ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి చర్యలు చేపట్టాలని, గ్రామస్తుల సమక్షంలో చేసిన తీర్మానాలు, ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీఐఓ సుశీల్, ఏఓ రాంబాబు, జీసీడీఓ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయండి

చండ్రుగొండ : ఇంటింటి సమగ్ర సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్య ప్రణాళికా అధికారి సంజీవరావు మండల అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. సర్వే తీరుతెన్నులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు చేస్తున్న సర్వేను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఏపీఎం సంతోష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఆర్‌ఐ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని సూచనలు స్వీకరించేందుకు శుక్రవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రీజియన్ పరిధిలోని సమస్యలను వెల్ల డించేలా ఆర్‌ఎంతో మాట్లాడేందుకు మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు 99592 25954 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

భక్తులకు బాధలే..!



భద్రాచలం రామయ్య దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు(ఫైల్)

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో పర్వదినాల సందర్భంగా సీతారాముల దర్శనం, పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులు సరైన ఏర్పాట్లు లేక ఇబ్బంది పడుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పర్వదినాల్లో భద్రగిరికి పోటెత్తుతున్న భక్తులు

- ముక్కోటి, నవమికే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇతర పండుగ రోజుల్లో నామమాత్రపు చర్యలతోనే సరి
- మహిళలు వస్త్రాలు మార్చుకునే గదులు, మొబైల్ టాయిలెట్లూ కరువే

రెండు రాష్ట్రాల నుంచి..

భద్రాచలంలో కొలువుదీరిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దేశ వ్యాప్తంగా ఈ ఆలయం ప్రసిద్ధి. ముఖ్యంగా శ్రీరామ నవమి సందర్భంగా జరిగే సీతారాముల కల్యాణం, ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారా దర్శనం చేసుకునేందుకు వేలాది మంది భక్తులు భద్రాచలం చేరుకుంటారు. ఈ రెండు పర్వదినాల సందర్భంగా వచ్చే భక్తులకు సేవలు అందించడంపై మాత్రమే దేవాదాయ శాఖ దృష్టి పెడుతోంది. రూ.కోటి పైగా వ్యయంతో ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈ రెండు ఉత్సవాలతో పాటు ఇతర పర్వదినాల్లోనూ వేల సంఖ్యలో భక్తులు వస్తున్నా.. వారి కోసం ఆలయం ఆధ్వర్యంలో ఎలాంటి సౌకర్యాలూ కల్పించడం లేదు.

హనుమాన్ మాలధారులతో..

హనుమాన్ మాల ధారణ సమయంలో భద్రాచలానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. గతేడాది 50 వేల మందికి పైగా భక్తులు రెండు రాష్ట్రాల నుంచి తరలిరావడంతో పట్టణ వీధులు, ఆలయ ప్రాంగణం, గోదావరి తీరం కిక్కిరిసిపోయాయి. స్నానాలు, దర్శనాల సమయంలో భక్తులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఇలాంటి సమయాల్లో అయినా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుంటే ఎలా అని హనుమాన్ మాల ధారులతో పాటు సాధారణ భక్తులు సైతం ఆవేదన చెందుతున్నారు. ఆలయ ప్రాంగణం వద్ద, గోదావరి తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఉగాది, తొలి ఏకాదశి వంటి పండుగలు, సెలవు రోజుల్లోనూ కుటుంబ సమేతంగా రామయ్య దర్శనానికి భక్తులు వస్తుండగా, వారికీ ఇక్కట్లు తప్పడం లేదు.

మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి..

గోదావరికి వరదలు వచ్చిన సమయంలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తారు. ప్రైవేటు సంస్థలకు చెందిన వాహనాలతో పాటు ఆర్టీసీ మొబైల్ టాయిలెట్లను సైతం ఇక్కడికి రప్పిస్తారు. అదే తరహాలో కార్తీక పౌర్ణమి, ఉగాది, హనుమాన్ జయంతి వంటి ప్రత్యేక రోజుల్లో స్త్రీలు బట్టలు మార్చుకునే సౌకర్యాలతో పాటు తాత్కాలిక ప్రాతిపదికన మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు హనుమాన్ దీక్ష చేపట్టిన భక్తులు భద్రాచలంలో బస చేసేందుకు వీలుగా విశాలమైన హాలు, డార్మిటరీలు కూడా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

గోదావరి తీరంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు (ఫైల్)



దీపాలు వెలిగించేందుకు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, దీపాలు వెలిగించేందుకు భద్రాచలానికి పోటెత్తుతారు. ముఖ్యంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. తెల్లవారుజాము నుంచే గోదావరి తీరంలో సందడి మొదలవుతుంది. అయితే గోదావరి తీరం వెంట స్త్రీలు బట్టలు మార్చుకునేందుకు కూడా తగిన వసతులు లేవు. ఇందుకోసం స్నానఘట్టాల దగ్గర ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. దాదాపు 500 మీటర్ల పొడవునా భక్తులు స్నానాలు చేస్తుంటారు. అయితే స్త్రీలు బట్టలు మార్చుకునే అవకాశం కేవలం ప్రధాన మెట్ల వద్దే ఉంది. ఇక్కడికి దూరంలో స్నానం చేసే మహిళా భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా టాయిలెట్ల విషయంలోనూ అదనపు ఏర్పాట్లు లేవు.

సింగరేణి పేరు ప్రతిష్టలు నిలబెట్టాలి



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): మార్కెట్‌లో పోటీని తట్టుకునేలా నాణ్యమైన బొగ్గు సరఫరా చేస్తూ సింగరేణి పేరు ప్రతిష్టలు నిలబెట్టాలని సింగరేణి డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు సూచించారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని ప్రాజెక్ట్ ప్లానింగ్ కార్యాలయ ఆవరణలో క్వాలిటీ విభాగం ఆధ్వర్యాన గురువారం బొగ్గునాణ్యత వారోత్సవాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించిన డైరెక్టర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి సంస్థ అయిన సింగరేణి పలు సంస్థలకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఇతర సంస్థలకు దీటుగా నాణ్యత కొనసాగించేలా ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కాగా, కొత్తగూడెం ఏరియాలో కార్యాలయంలో కూడా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు పతాకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి సందడి..



విద్యుత్ లైట్ల వెలుతురులో ఖమ్మం శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయం

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక పౌర్ణమి శివకేశవులకు ప్రీతిపాత్రమైన రోజు. ఈరోజు దీపం వెలిగిస్తే సర్వపాపాలు హరించడమే కాక అంతా మంచి జరుగుతుందని భక్తుల నమ్మిక. ఈమేరకు శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు చేరుకుని పూజలు చేసి దీపాలు వెలిగించనున్నారు. ఈసందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అంతేకాక పలువురు నదీస్నానానికి ఏర్పాట్లు చేసుకున్నారు. కార్తీక పౌర్ణమి రోజున శివాలయాల్లో జ్వాలా తోరణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

తీగలాగితే డొంక కదిలింది !

'జూలూరుపాడు దంపతుల ఆత్మహత్య' కేసులో మలుపులు

- ఆ కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్న మహిళ దారుణ హత్య
- ఆత్మహత్య కేసులో సెటిల్‌మెంటే ప్రస్తుత మర్డర్‌కు కారణం?
- గతంలో నమోదైన కేసులకు ప్రస్తుత హత్యకు సంబంధాలు !

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గత సెప్టెంబర్‌లో జూలూరుపాడులో జరిగిన దంపతుల ఆత్మహత్య కేసు విషయంలో తీగ లాగితే డొంక కదిలినట్టుగా పలు అంశాలు బయటపడుతున్నాయి. వివాహేతర సంబంధాలు, అక్రమ పద్ధతుల్లో ఉద్యోగం నేపథ్యంలో జరిగిన నేరాలు, వాటిని కప్పిపుచ్చేందుకు చేసిన సెటిల్‌మెంట్లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇప్పటికే ఈ కేసుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం కలిగిన నలుగురు చనిపోయారు.

సింగరేణి దందాతో మొదలు..

పెద్దపల్లి జిల్లాకు చెందిన స్వాతికి గతంలో మణుగూరుకు చెందిన వ్యక్తితో వివాహమైంది. అయితే భర్త చనిపోవడంతో కొత్తగూడెంలో ఓ పాఠశాలలో పని చేస్తుండగా జూలూరుపాడు మండలం మాచినేనిపేటకు చెందిన వీరభద్రంతో పరిచయమైంది. అప్పటి నుంచి వారిద్దరు సహజీవనంలో ఉన్నారు. ఆ తర్వాత వీరభద్రంకు మరో యువతితో వివాహమైంది. కాగా, ఇదే మండలం సాయిరాంతండాకు చెందిన రత్నకుమార్, పార్వతి దంపతులు కొత్తగూడెంలో ఓ షాపింగ్‌మాల్‌లో పని చేసే సమయంలో స్వాతితో పరిచయమైంది. సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తానన్న స్వాతి మాటలు నమ్మి వారు రూ.16లక్షలు ఇచ్చారు. చివరకు మోసపోయామని గ్రహించి సెప్టెంబర్ 30 ఇద్దరూ ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.



మృతురాలు స్వాతి(ఫైల్)

సెటిల్‌మెంట్ ఆరోపణలు..

ఆ కేసు విషయంలో ఆరోపణలు ఎదుర్కొన్న స్వాతిని చుంచుపల్లి పోలీసులు విచారించారు. ఈ సందర్భంగా సింగరేణిలో ఉద్యోగాల పేరుతో జరిగే దందా ఎలా ఉంది ? అమాయకులెలా బలవుతున్నారు? పార్వతి, రత్నకుమార్ చనిపోవడానికి ముందు జరిగిన సంఘనలు ఏంటనే అంశంపై పెద్దగా ఫోకస్ పెట్టలేదనే ఆరోపణలు వస్తున్నాయి. రూ.16 లక్షల చుట్టూనే చర్చ జరిగినట్టు తెలుస్తోంది. చివరకు బాధిత కుటుంబాలకు రూ.8 లక్షలు ఇవ్వాలనే షరతులపై 'ఓ ఖాకీ' ఈ వివాదాన్ని సెటిల్ చేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అంతేకాదు ఆత్మహత్య కేసు మెడకు చుట్టుకోకుండా రాజీ చేసినందుకు సదరు ఖాకీకి నజరానాగా రూ.8 లక్షలు ఇవ్వాలనే ఒప్పందం కుదిరినట్టు తెలుస్తోంది. ఈ డీల్ ప్రకారం బాధితుల కుటుంబాలకు రూ.8 లక్షలు, డీల్ సెట్ చేసిన ఖాకీకి రూ.8 లక్షలు ఇచ్చేందుకు నెల గడువు పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో రూ.8 లక్షలతో రాజీ కుదిరినట్టు మీడియా ముఖంగా పోలీసులు ధ్రువీకరించారు.

ఒత్తిడి రావడంతో

సెటిల్‌మెంట్ జరిగి నెల దాటడంతో నగదు చెల్లించాలంటూ స్వాతిపై నలువైపులా ఒత్తిడి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ అంశంపై వీరభద్రం, స్వాతి మధ్య పలుమార్లు వివాదం జరగడంతో.. ఆమెను తప్పిస్తే తనకే సంబంధం లేకుండా పోతుందనే నిర్ణయానికి వీరభద్రం వచ్చినట్టు చెప్పుకుంటున్నారు. అప్పటికే నేర చరిత్ర ఉండటంతో పక్కా ప్లాన్‌తో స్వాతిని మట్టుబెట్టి ఊరి చివర తన చేలోనే పాతిపెట్టాడు. మరోవైపు సెటిల్‌మెంట్ నజరానా రాకపోవడంతో సదరు ఖాకీ నిఘా వీరభద్రంపై పెరిగింది. దీంతో స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా హత్య విషయం వెలుగు చూసినట్టుగా ప్రచారం జరుగుతోంది.

తొలి కేసప్పుడు జాగ్రత్త పడితే..

ఆత్మహత్యలు – హత్య కేసులో తొలి బీజం సెప్టెంబర్ 27న పడింది. వీరభద్రం భార్యపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేయడంతో జూలురుపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత రెండు రోజులకే పార్వతి-రత్నకుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ తర్వాత మరో కేసు నమోదైంది. అంతకు 20 రోజుల ముందు స్వాతి దగ్గర సింగరేణిలో ఉద్యోగం పేరుతో డబ్బులు తీసుకున్న వ్యక్తి కూడా అనుమానాస్పద రీతిలో చనిపోయాడు. తొలి కేసు నమోదైన తర్వాత లోతైన విచారణ జరిపితే కనీసం మూడు నిండు ప్రాణాలు దక్కేవి. నేరాలకు పాల్పడిన వారికి చట్ట ప్రకారం శిక్షలు పడేవి. కానీ విచారణలో నిర్లక్ష్యం, సెటిల్‌మెంట్‌పై ఉత్సాహంతో ఈ కేసు రోజుకో మలుపు తీసుకుంటోంది.

స్వాతిపై కేసులేమీ లేవు

పార్వతి – రత్నకుమార్ ఆత్మహత్య కేసులో స్వాతిపై ఆరోపణలు రావడంతో విచారించాం. అయితే ఆ ఆత్మహత్యలకు స్వాతికి ఏ సంబంధం లేదని తేలడంతో ఆమెపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు. దంపతుల ఆత్మహత్య విషయంలో పోలీసులు సెటిల్‌మెంట్ చేశారనే ప్రచారంలో వాస్తవం లేదు.

– అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం డీఎస్పీ

పిల్లల్లో సృజనాత్మకత వెలికితీయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన అదనపు కలెక్టర్ విద్యాచందన తదితరులు (ఇన్‌సెట్) దివ్యాంగ విద్యార్థినుల నృత్య ప్రదర్శన



- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఐడీఓసీలో ఘనంగా బాలల దినోత్సవం

సూపర్‌బజార్(కొత్తగూడెం): పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మిషన్ వాత్సల్య పథకం, బాలల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ భవిష్యత్ పిల్లల పైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రతి చిన్నారిలోనూ నైపుణ్యం దాగి ఉంటుందని, దానిని గుర్తించి ఆయా రంగాల్లో అభివృద్ధి చెందేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో ప్రతిభ గల పిల్లలు చాలామంది ఉన్నారని, ఇటీవల గిరిజన సంక్షేమ శాఖ నిర్వహించిన ఆటల పోటీల్లో జిల్లా విద్యార్థులు చాంపియన్ ట్రోఫీ గెలుచుకున్నారని తెలిపారు. తన బాల్యంలో జరిగిన వేడుకల గురించి అందిరతో పంచుకున్నారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస పత్రాలు, పుస్తకాలు అందజేశారు. కుసుమకుమారి అనే విద్యార్థిని బీఎస్సీ నర్సింగ్ చదివేందుకు ఎస్‌ఆర్‌ఐ తోటకూర రమేష్ విరాళంగా ఇచ్చిన రూ.లక్ష చెక్కును కలెక్టర్ ఆమెకు అందజేశారు. న్యాయవాది సాధిక్‌పాషా రచించిన 'ది ఇన్నర్ వరల్డ్ ఆఫ్ చిల్డ్రన్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీడబ్ల్యూఓ లెనినా, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతిరాణి, సభ్యులు సుమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు..

కొత్తగూడెంఅర్బన్: గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని, వాటిపై ఆధారపడి చదివిన వారి జీవితాలు సుందరమయంగా ఉంటాయని కలెక్టర్ పాటిల్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభం కాగా, అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సరస్వతీ దేవి, గ్రంథాలయాల పితామహుడు ఎస్‌ఆర్ రంగరాజన్, చాచా నెహ్రూ చిత్రపటాలకు పూల మాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున చిన్నారులు హాజరు కావడం అభినందనీయమని, వారంతా పుస్తకాల విలువ తెలుసుకోవాలని సూచించారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. ఓ మంచి పుస్తకం కొనుక్కో అనే సూక్తిని ఎవరూ మరవొద్దని కోరారు. వారోత్సవాలను పురస్కరించుకుని పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారని, వాటి ద్వారా చిన్నారుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీయాలని పిలుపునిచ్చారు. నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని, అన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, గ్రంథాలయ ఇన్‌చార్జ్ ఎం.నవీన్‌కుమార్, గ్రంథపాలకురాలు జి.మణిమృదుల, మధుబాబు, వంశీ, జానీ, వాణి, రుక్మిణి, గీత పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'లో పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లా ఎంపిక

కొత్తగూడెంరూరల్: ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా(అభ) కార్యక్రమం కింద హెల్త్ ప్రొఫైల్ నమోదుకు పైలెట్ ప్రాజెక్ట్‌గా జిల్లాను ఎంపిక చేసినట్లు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ జాయింట్ డైరెక్టర్ మంజూనాథ్ నాయక్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు పీహెచ్‌సీలను ఆయిన సందర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్ నాయక్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయిన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతీ ఒక్కరి ఆరోగ్య వివరాలను ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీలో నమోదు చేయాలని సూచించారు. ఈ ఐడీ కార్డు పొందేందుకు సమీపంలోని పీహెచ్‌సీ లేదా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సంప్రదించాలని తెలిపారు. జిల్లాలోని 29 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌సీల్లో కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. ఈ డిజిటల్ కార్డులో కీలక మైన ఆరోగ్య సమాచారం ఉంటుందని, ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స, ఇతర అరోగ్య సంరక్షణ సేవలకు ఇది ఉపకరిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ డెమో ఫయిజ్ మోహిద్దీన్, డీపీఓ సరిత, అకౌంటెంట్ భానుప్రసాద్, రెహ్మాన్ పాల్గొన్నారు.



డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతున్న మంజునాథ్ నాయక్

ఉద్యోగుల సహకారంతోనే సామాజిక సేవ



చెక్కు అందజేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

విద్యుత్ శాఖ ఎస్‌ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉద్యోగుల సహకారంతోనే టీజీ ఎన్‌పీడీసీఎల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ జి.మహేందర్ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ నెల ప్రతీ ఉద్యోగి నుంచి కొంత మొత్తాన్ని విరాళంగా సేకరిస్తున్నామని, ఈ డబ్బును ఆనాథాశ్రమాలు, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థలకు అందజేయాలని నిర్ణయించామని వివరించారు. అంతకుముందు పాల్వంచలో నిర్వహిస్తున్న శాంతి వెల్ఫేర్ అసోసియేషన్(దివ్యాంగుల పాఠశాల)కు తొలి సాయంగా రూ. 20 వేల చెక్కును నిర్వాహకురాలు కె.క్రిస్టోలైట్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె. శ్రీధర్, పాల్వంచ డీఈ పి.ఎస్.వి.ఎస్. నందయ్య, టెక్నికల్ ఏడీఈ కె.రాంప్రసాద్, కొత్తగూడెం ఏడీఈ జి.లక్ష్మి, టెక్నికల్ ఏఈ ఆర్.మానస తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళలతో చైతన్యం..



మాట్లాడుతున్న సింగరేణి జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కళలతో మానసి కోల్లాసం, ఆహ్లాదం కలిగించడంతోపాటు ప్రజల్లో చైతన్యం తేవొచ్చని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు అన్నారు. కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీవోఏ క్లబ్‌లో రెండు రోజుల పాటు జరిగే కంపెనీ లెవల్ కల్చరల్ మీట్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక, అధికారుల సంఘాల నాయకులు, క్రీడల బాధ్యులు కోటిరెడ్డి, శివ కేశవరావు, రజాక్, వై.గట్టయ్య, ఉపేంద్రబాబు, ఎం.శ్రావణ్‌కుమార్, టి. శ్రీనివాస్, హెచ్ ఆచార్య, ఉషా మాధవి, శాంతిశ్రీ, జే.రాంబాబు, పాసినెట్, కే.నాగమోహన్, సీహెచ్ సాగర్, రామ్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే సహకార వారోత్సవాలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తదితరులు

పాల్వంచ: రైతుల శ్రేయస్సు కోసమే సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం వద్ద సహకార వారోత్సవాల సందర్భంగా సహకార జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్‌లు బుడగం రాంమోహన్ రావు, కనగాల నారాయణ రావు, చొగాని పాపారావు, సామా జనార్దన్ రెడ్డి, మైనేని వెంకటేశ్వరరావు, మధుసూదన్ రావు, కిషన్, సీఈఓ జి.లక్ష్మీ నారాయణ, సురేందర్ రెడ్డి, లక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గుండాల: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆళ్లపల్లి మండలంలోని కిచ్చెనపల్లి గ్రామానికి చెందిన గొగ్గెల లక్ష్మీనారాయణ(40) నిత్యం మద్యం తాగుతుండగా, తల్లిదండ్రులు మందలించారు. దీంతో బుధవారం పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న మహిళ..

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ ఆజాద్‌నగర్‌కు చెందిన మల్లెల సునీల (65) ఈ నెల 4న కుటుంబంలో ఘర్షణ జరిగింది. దీంతో మనవడు వంగూరి అరవింద్ కర్రతో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. అప్పటి నుంచి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండాలో మహిళ హత్య కేసులో ఇద్దరు నిందితులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. మాచినేనిపేటతండాకు చెందిన బానోత్ భద్రం, అతని తల్లి సరోజ కలిసి తోట స్వాతి(32)ని హత్య చేశారు. మృతదేహాన్ని గ్రామ సమీపంలోని పత్తి చేలో పూడ్చిపెట్టారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బూర్గంపాడు: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సారపాకలో చేపట్టిన తనిఖీల్లో ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఆటోను పోలీస్ ఠాణాకు తరలించి ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

కమీషన్ల కక్కుర్తి..!

- పాత సీసీ రోడ్డుకు కొత్తగా బీటీ ప్యాచ్ వర్క్
- ఆ పేరుతో రూ.2 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రణాళిక
- సూపర్‌బజార్–న్యూగొల్లగూడెం రోడ్డుకు డీఎంఎఫ్‌టీ నిధులు
- కొద్దిమేర నిర్మించి నిధులు కాజేయాలనే ప్రయత్నం



కొత్తగూడెం సూపర్‌బజార్ నుంచి న్యూగొల్లగూడెం వెళ్లే దారిలో వాహనాల రద్దీ

కొత్తగూడెంటౌన్/కొత్తగూడెం రూరల్: కొత్తగూడెం సూపర్‌బజార్ నుంచి ఎదురుగడ్డ మీదుగా న్యూగొల్లగూడెం వైపు వెళ్లే రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణలో రైల్వే శాఖ కొర్రీలు పెడుతోంది. దీంతో రోడ్డు నిర్మాణం ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి. అయితే ఇదే అదునుగా పాత రోడ్డుకు ప్యాచ్‌లు వేసి కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కమీషన్లు దండుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పాత రోడ్డుకు కొత్త హంగులు జోడించి బీటీ వేద్దామని ప్రణాళికలను రూపొందించడం సందేహాలకు తావిస్తోంది.

బీటీ, ప్యాచ్‌లతో పైసలు కాజేద్దామని..

కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి న్యూగొల్లగూడెం, బొమ్మనపల్లి మీదుగా ఇల్లెందు రోడ్డు వరకు 1.2 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు కేటాయించారు. 12 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇందుకు డిస్ట్రిక్ మినరల్ ఫండ్‌ను గత జూన్‌లో కేటాయించారు. కానీ ఈ రోడ్డు పనులు పక్కకు పెట్టి ఇప్పటికే ప్రజలు రాకపోకలను సాగిస్తున్న 5 మీటర్ల వెడల్పుతో 680 మీటర్ల మేర ఉన్న పాత సీసీ రోడ్డుకు కొత్త రోడ్డు పేరుతో రూ.2 కోట్లతో ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. బీటీ రోడ్డు వేసి, ప్యాచ్ వర్కులతో నిధులు ఖర్చు చేద్దామని అధికారులు చూస్తున్నారు. స్థానిక వ్యాయామశాల నుంచి ఎదురుగడ్డ వరకు తారు రోడ్డు నిర్మాణం చేయాలని తలపెట్టారు. ఇదంతా అధికారులు, కాంట్రాక్టర్లు కమీషన్లు దండుకోవడంకోసమేననే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకే రోడ్డు విస్తరణకు అవసరమైన



బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నది ఈ సీసీ రోడ్డుపైనే..

స్థల సేకరణ విషయం తేలకముందే నిర్మాణం చేపడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. కాగా ఈ నెల 18న ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

రైల్వే స్థల సేకరణపై రాని స్పష్టత

ఈ మార్గంలో మూడేళ్ల క్రితం రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి గొల్లగూడెం వరకు రోడ్డు వరకు ఉన్న షాపులను సైతం తొలగించారు. ఇక్కడ రైల్వే శాఖ ఇవ్వాల్సిన 7 మీటర్ల స్థలం నేటికీ దక్కలేదు. స్థలం ఇవ్వాలంటే రైల్వే శాఖకు రూ.15 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు మున్సిపల్ అధికారులు నిరాకరించారు. ఈ నేపథ్యంలో రోడ్డు వ్యవహారం ఇప్పట్లో తేలేలా లేదు. ఈ రోడ్డు సూపర్ బజార్‌నుంచి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పక్క నుంచి, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, ఎదురుగడ్డ పంచాయతీ, కారుకొండ మీదుగా ఇల్లెందు రోడ్డుకు కలుస్తుంది. కొత్తగూడెంలో వర్తక, వ్యాపారాలకు కేంద్రమైన పెద్దబజార్, చిన్నబజార్‌లకు ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. ఈ క్రమంలో వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఖమ్మం ఎంపీ, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి రైల్వే స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని, 12 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించేలా చూడాలని జిల్లా కేంద్రంలోని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం

కొత్తగూడెం సూపర్‌బజార్ నుంచి న్యూగొల్లగూడెం, బొమ్మనపల్లి మీదుగా ఇల్లెందు రోడ్డు వరకు 1.2 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. మొదట ఎదురుగడ్డ నుంచి రోడ్డు ప్రారంభిస్తాం. అక్కడి నుంచి సూపర్ బజార్ రైల్వే స్టేషన్ వరకు నిర్మాణం జరుగుతుంది. రైల్వే శాఖ అనుమతుల కోసం ఇన్నాళ్లు ఎదురుచూశాం. కొత్తగూడెంలో రోడ్డు నిర్మాణాల కోసం రైల్వేశాఖ ఏడు మీటర్ల మేర పొడవుతో దాదాపు ఎకరన్నర భూమి ఇవ్వాల్సి ఉంది. దీనికి బదులుగా ఖమ్మం, లేదా గాంధీపురం ప్రాంతంలో ఎకరన్నర భూమి కావాలని రైల్వే అధికారులు అడిగారు. త్వరలో ప్రభుత్వం, రైల్వేశాఖలు నిర్ణయం తీసుకుంటాయి.

– వి.వెంకటేశ్వర్లు ఈఈ, ఆర్‌అండ్‌బీ

చెట్టు కిందే వృద్ధురాలి జీవనం

ఆదుకోవాలని వేడుకోలు



ఆర్టీసీ డిపో వద్ద రోడ్డుపై చెట్టు కింద నివసిస్తున్న వృద్ధురాలు

మణుగూరు టౌన్: కట్టుకున్నవాడు అనంత లోకాలకు పోయాడు. కడుపున పుట్టినవారు ఆదరించడంలేదు. ఉన్న రెండు కాళ్లు కూడా పనిచేయకపోవడంతో చేసేది లేక ఓ వృద్ధురాలు రోడ్డు పక్కన ఉన్న చెట్టు నీడన కుర్చునే బల్లలను ఆశ్రయంగా మార్చుకుంది. బాధితురాలి వివరాలిలా ఉన్నాయి. గాంధీనగర్‌కు చెందిన కుదుర్ల సుశీల భర్త 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు. ఇద్దరు కూతుళ్లలో ఒకరు కొత్తగూడెం, మరొకరు మణుగూరులో ఉంటున్నారు. ఇద్దరి వద్ద కొన్ని రోజులపాటు ఉన్నది. వారి బతుకే భారంగా నడుస్తున్న క్రమంలో తల్లిని సాదలేమన్నారు. దీంతో చేసేదిలేక రోడ్డు పక్కన చెట్టునీడన రెండునెలలుగా జీవనం సాగిస్తోంది. విషయం తెలిసి తహసీల్దార్ రాఘవరెడ్డి రెవెన్యూ సిబ్బంది చేత ఓ హాస్టల్‌లో ఆశ్రయం కల్పించే విధంగా ఏర్పాట్లు చేయించారు. వృద్ధురాలు తన పనులు తాను చేసుకోలేకపోవడంతో హాస్టల్ లోనూ చేసే వారు లేక పొమ్మన్నారు. గత్యంతరం లేని బాధితురాలు మణికంఠనగర్‌లో ఓ వృద్ధాశ్రమంలో ఆశ్రయం కోరగా వచ్చే పింఛన్ ఇస్తే చేర్చుకుంటామన్నారు. కానీ 86 శాతం దివ్యాంగురాలైనా ఆమెకు ఇంతవరకు ప్రభుత్వం పింఛన్ ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దివ్యాంగురాలి పింఛన్ మంజూరు చేయాలని, చక్రాల బండిని అందించాలని వేడుకుంటోంది.

తాచుపాము పట్టివేత



తాచుపాము

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు బర్లిఫిట్‌లో ఉన్న సింగరేణి వర్క్ షాప్ సమీపంలో బుధవా రం రాత్రి 9 గంటలకు పెద్ద తాచుపాము రావడంతో సింగరేణి సిబ్బంది, స్థానికులు ఆందోళన చెందారు. సమాచారం ఇవ్వడంతో ప్రాణధార ట్రస్ట్ నిర్వాహకుడు, స్నేక్ రెస్క్యూ కోఆర్డినేటర్ సంతోష్ అక్కడికి చేరుకుని ఆరు అడుగుల తాచుపామును చాకచక్యంగా డబ్బాలో బంధించాడు. కాగా బుధవారం కొత్తగూడెంలోని ప్యూన్‌బస్తీ, రైటర్‌బస్తీ, ప్రగతినగర్ ప్రాంతాల్లోని జనావాసాల్లోకి నాలుగు పాములు రాగా, వాటిని పట్టుకున్నట్లు సంతోష్ తెలిపాడు.

మహిళ ఆత్మహత్య

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీకి చెందిన లక్కా ఐలమ్మ (58) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. రెండేళ్ల క్రితం భర్త రాములు మృతిచెందడంతో ఒంటరిగా ఉంటూ మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు

అజ్ఞాత దళ సభ్యురాలు అరెస్టు



పోలీసులకు పట్టుబడిన ఓయెమ్ నందే

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని పామేడ్ ఏరియా మావోయిస్టు కమిటీకి అనుబంధంగా పనిచేస్తున్న క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘం అజ్ఞాత దళ సభ్యురాలు ఓయెమ్ నందే పోలీసులకు పట్టుబడింది. ఈ మేరకు వివరాలను భద్రాచలం ఇన్‌చార్జ్ డీఎస్పీ వి.రవీంద్రరెడ్డి గురువారం వివరాలు వెల్లడించారు. దుమ్ముగూడెం మండలంలోని సీతానగరంలో సీఐ బి.అశోక్ ఆధ్వర్యాన 141 సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించిన మహిళను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. ఈమేరకు ఆమె క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘం అజ్ఞాతదళ సభ్యురాలు ఓఝెమ్‌గా తేలిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బాసగూడకు చెందిన ఆమె 1999 నుండి 2002వరకు మావోయిస్టు బాసగూడ ఏరియా బాలల సంఘంలో సభ్యురాలిగా, ఆతర్వాత నుంచి ఆదివాసీ మహిళా సంఘంలో దళసభ్యురాలిగా పనిచేస్తోందని తెలిపారు. దళ సభ్యులతో ఆదివాసీ గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ మావోయిస్టుల్లో చేరేలా స్థానికులను ప్రేరేపిస్తోందని వెల్లడించారు. ఈసందర్భంగా ఓఝెమ్ ఆమె నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన కరపత్రాలు, సాహిత్యాన్ని స్వాధీనం చేసుకుని కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

104 కేజీల గంజాయి సీజ్



కారులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

పాల్వంచరూరల్: కారులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ జీసీసీ కార్యాలయం వద్ద బీసీఎం జాతీయ రహదారిపై గురువారం ఖమ్మానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును తనిఖీ చేయగా, 104 కేజీల గంజాయి లభించింది. గంజాయితోపాటు కారు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న బెంగళూరుకు చెందిన దిలీప్‌కుమార్, కట్టా హర్షిత్, మల్కన్‌గిరికి చెందిన సురిజిత్ మండల్, సునీల్‌రేలను అదుపులోకి తీసుకుని స్థానిక ఎక్సైజ్‌శాఖ అధికారులకు అప్పగించారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేశామని, పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని సీఐ ప్రసాద్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీనివాస్, గణేష్ కుమార్ పాల్గొన్నారు.

భద్రాచలంలో 10 కేజీలు..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో గురువారం వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఓ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపుతుండగా, బైక్ అదుపు తప్పి బారికేడ్లకు తగిలింది. ఈ క్రమంలో హెడ్‌కానిస్టేబుల్ అనంతయ్యకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారులను అదుపులోకి తీసుకుని విచారించగా, విజయవాడకి చెందిన వారు సీలేరులో గంజాయిని కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు తేలింది. కాగా తనిఖీల సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి గంజాయి ఉన్న బ్యాగ్‌ను అక్కడే విసిరేసి పరారైనట్లు సమాచారం.

మరో రెండు పోలీస్ క్యాంపులు..

- మావోయిస్టు కోటలో ఏర్పాటు చేసిన పోలీసులు

చర్ల: తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రెండు రోజుల క్రితం రెండు పోలీసు క్యాంపులు ఏర్పాటయ్యాయి. పోలీసు బలగాలు కనీసం కాలు పెట్టడానికి కూడా సాహసం చేయలేని ఆ ప్రాంతాల్లో ఏకకాలంలో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తి స్థాయిలో నిర్మూలిస్తామంటూ చేసిన ప్రకటన సఫలీకృతం అవుతుందనే చర్చ సాగుతోంది. చర్ల మండల కేంద్రానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధి కొండపల్లి, సుకుమా జిల్లా చింతగుఫ పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మలపాడు ప్రాంతాలను సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, కోబ్రా, ఎస్టీఎఫ్, బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. పోలీసు క్యాంపులు ఏర్పాటు చేసిన కొండపల్లి, తుమ్మలపాడు ప్రాంతాల్లో గతంలో మావోయిస్టులు పెద్ద ఎత్తున సంచరించారు. ఇక మిగిలిన ప్రాంతాల్లోనూ క్యాంపుల ఏర్పాటు ఛత్తీస్‌గఢ్ పోలీసు శాఖకు సునాయాసం కానుంది.

సీపీఐ వందేళ్ల ఉత్సవాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం): సభ్యత్వ నమోదును వేగవంతంగా పూర్తి చేసి, సీపీఐ వందేళ్ల ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. శేష గిరిభవన్‌లో గురువారం జరిగిన పట్టణ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఏడాది డిసెంబర్ 26 తేదీ వరకు సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా జరపాలన్నారు. సమావేశంలో జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడి నగేష్, భూక్య శ్రీనివాస్, ఎస్‌కె ఫహీం, నాయకులు సురేష్, యూసుఫ్, ధర్మరాజు, రమేష్, మాచర్ల శ్రీనివాస్, అనంతలక్ష్మి, బోయిన విజయకుమార్, సత్యనారాయణ చారి, దుర్గ, మేదిని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసు నమోదు

పాల్వంచరూరల్: తల్లిపై దాడి చేసిన ఘటనలో కుమారుడిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కాంతోజు వీరమ్మ, ఆమె కుమారుడు లవాచారి మధ్య ఇంటి విషయంలో కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో గురువారం మరోసారి గొడవపడ్డారు. తనను కొట్టి బూతులు తిట్టాడని తల్లి ఫిర్యాదు చేయగా, కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెరగాలి

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- ముగిసిన జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్, తదితరులు

వైరా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, తద్వారా క్రీడాస్ఫూర్తి పెరిగి గెలుపోటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడుతుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న గురుకులాల జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు గురువారం ముగిశాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలోని గురుకులాల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం అలవడుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్.జైపాల్, డీసీఓ రాజ్యలక్ష్మి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు శివకుమారి, చావా జ్యోతి, లిల్లీ, ఎం.పద్మావతి, గంటేల సునీత, పీ.వీ.పద్మావతి, టి.విజయదుర్గ, ఉద్యోగులు టి.సాయికిరణ్, ఎం.డీ.షాకీరా తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్లుగా వైరా, భద్రాచలం, ఇల్లెందు

జోనల్ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో వైరా, భద్రాచలం, ఇల్లెందు గురుకులాలు విద్యార్థులు వరుసగా అండర్–14, 17, 19 విభాగాల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. అలాగే, వ్యక్తిగతంగా అండర్–14 విభాగం నుంచి ఎస్.ఎస్.భార్గవి(వైరా), అండర్–17లో కె.స్రవంతి (భద్రాచలం), అండర్–19లో ఎన్.సరిత (ఇల్లెందు) ట్రోఫీ అందుకున్నారు. ఇక వ్యకిగత క్రీడల్లో అండర్–14, 17 విభాగాలకు సంబంధించి ములకలపల్లి గురుకుల విద్యార్థులు, అండర్–19 విభాగంలో కల్లూరు గురుకుల విద్యార్థులు అత్యధిక పాయింట్లు సాధించారు. అలాగే, అండర్–14 కబడ్డీలో ములకలపల్లి, కల్లూరు, ఖో–ఖోలో ములకలపల్లి, అడవిమల్లెల, టెన్నికాయిట్ డబుల్స్‌లో దానవాయిగూడెం, వైరా, క్యారమ్స్ డబుల్స్‌లో నేలకొండపల్లి, కూసుమంచి, చదరంగంలో అడవిమల్లెల, ఎర్రుపాలెం, అండర్–17 కబడ్డీలో ములకలపల్లి, వైరా, ఖో–ఖోలో ఎర్రుపాలెం, ములకలపల్లి, వాలీబాల్‌లో భద్రాచలం, కూసుమంచి, బాల్ బ్యాడ్మింటన్‌లో మధిర, వైరా, టెన్నికాయిల్ డబుల్స్‌లో దానవాయిగూడెం, పాల్వంచ విద్యార్థులు, క్యారమ్ డబుల్స్‌లో టేకులపల్లి, ములకలపల్లి, చదరంగంలో నేలకొండపల్లి, ములకలపల్లి విద్యార్థులు మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు. ఇక అండర్–19 విభాగం కబడ్డీలో ములకలపల్లి, అడవిమల్లెల, ఖో–ఖోలో కల్లూరు, ఎర్రుపాలెం, వాలీబాల్‌లో కల్లూరు, అంబేద్కర్ కాలేజీ, ఖమ్మం, హ్యాండ్‌బాల్‌లో కల్లూరు, టేకులపల్లి, బాల్ బ్యాడ్మింటన్‌లో మధిర, వైరా, టెన్నికాయిట్ డబుల్స్‌లో దానవాయిగూడెం, వైరా, క్యారమ్స్ డబుల్స్‌లో ఎర్రుపాలెం, అంబేద్కర్ కాలేజీ, ఖమ్మం, చదరంగంలో అంబేద్కర్ కాలేజీ, ఖమ్మం, అడవిమల్లెల విద్యార్థులు వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న కాంతారావు

మణుగూరు రూరల్ : బీఆర్‌ఎస్ పునర్వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సూచించారు. గురువారం పద్మశాలీభవన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్ గెలిచేలా శ్రమించాలన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేల అనర్హతపై ఈ నెలాఖరున కోర్టు తీర్పునిచ్చే అవకాశం ఉందన్నారు. భద్రాచలం నుంచి పార్టీ అధిష్టానం తనకు టికెట్ కేటాయించే అవకాశం ఉందని, పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తొలుత పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ తల్లి, అంబేద్కర్, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, కో కన్వీనర్ బొలిశెట్టి నవీన్, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, కో కన్వీనర్ నూకారపు రమేష్ నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, పప్పుల ప్రసాద్, గుర్రం సృజన్, రవిప్రసాద్, మహిళా నాయకులు మునుకోటి ప్రమీల, మాధవి, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్–14 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్



పోటీలకు సిద్ధం చేసిన అథ్లెటిక్స్ ట్రాక్

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి అండర్–14 అథ్లెటిక్స్ బాలబాలికల పోటీలు ఖమ్మంలో శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయని జిల్లా పాఠశాలల క్రీడా సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు కానుండగా తొమ్మిది ఈవెంట్లలో పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే క్రీడాకారులతో జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. కాగా, శుక్రవారం జరిగే ప్రారంభోత్సవ సమావేశానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

అండర్–19 కరాటే టోర్నీ

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి కరాటే టోర్నీ నిర్వహించనున్నారు. జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఈ పోటీలు జరుగుతాయని సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం తెలిపారు. తొలిరోజు క్రీడాకారుల ఎంట్రీలు నమోదు చేసి, ఆతర్వాత రెండు రోజులు పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. పోటీలకు వివిధ జిల్లాల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు.